క్లుప్తంగా

రోడ్డు పనులు షురూ



శాంతినగర్: వడ్డేపల్లి–శాంతినగర్ రహదారి పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. శాంతినగర్ నుంచి వడ్డేపల్లి శివారు వరకు రోడ్డు గుంతలమయమై ప్రయాణానికి నరకంగా మారింది. తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే అంతర్రాష్ట్ర రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. శాంతినగర్ నుంచి రెండు కిలోమీటర్లమేర రోడ్డు పనులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఎట్టకేలకు జేసీబీతో పాత రోడ్డును తొలగించే పనులు చేపట్టారు. త్వరలో కొత్త రోడ్డు వేసేందుకు కసరత్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోండి



అయిజ: సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆపద కాలంలో ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా ఆస్పత్రి ఖర్చులు చెల్లించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ పేరుతో ఆర్థిక సహాయం చేస్తుందని తెలిపారు. బాధితులు ఉంటే ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకరావాలని సూచించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోండి


కూలిన మిద్దె

శాంతినగర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లెడుదిన్నె గ్రామస్తులు కోరారు. వడ్డేపల్లి మండలంలోని జిల్లెడుదిన్నెకు చెందిన ఈడిగ జయలక్ష్మి ఇల్లు ఆదివారం రాత్రి పైకప్పుతో పాటు గోడలు కూలిపోయాయి. వారం రోజుల క్రితం పైకప్పు నుంచి మట్టి రాలుతుండటంతో బంధువుల ఇంట్లోకి మారారు. మిద్దె కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణహాని జరగలేదు. జయలక్ష్మి భర్త ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబం రోడ్డున పడింది. ఆమెకు కూతురుతో పాటు కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబానికి ఇల్లు మంజూరు చేసి అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా వీహెచ్‌పీ ఆవిర్భావ దినోత్సవం



మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, అమరవాయి, చండూరు, తదితర గ్రామాల్లో సోమవారం విశ్వహిందూ పరిషత్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దిలేటి, గోవర్ధన్, పురుషోత్తం, కృష్ణ, రఘు, లక్ష్మీనారాయణ, కుర్మన్న పాల్గొన్నారు.

ఎర్రవల్లి: మండల కేంద్రంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో విశ్వహిందూపరిషత్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ కమిటీ సభ్యులు ఎర్రవల్లి కూడలిలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం శ్రీకృష్ణుడి చిత్ర పటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో నర్సింహులు, సత్యం, పరిపూర్ణ, జగదీష్, మహేష్, రాజు, రాజేష్, శంకరెడ్డి ఉన్నారు.

కల్యాణోత్సవానికి భారీ బందోబస్తు

గద్వాల క్రైం: మంగళవారం జములమ్మ కల్యాణోత్సవానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. జములమ్మ దేవస్థానంలో నిర్వహించే కల్యాణోత్సవానికి మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో జములమ్మ రిజర్వాయర్, ట్రాఫిక్ అంతరాయం లేకుండా, గద్వాల–కర్నూల్ రోడ్డు మార్గంలో సమస్యలు లేకుండా ట్రాఫిక్ సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. బందోబస్తుకు 50 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.


గద్వాల పట్టణంలో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు


అలంపూర్ మాంటిస్సోరిలో విద్యార్థుల నృత్యం


ఉండవెల్లిలో పాల్గొన్న యాదవ సంఘం సభ్యులు


తక్కశిలలో కృష్ణుడి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

ముకుందా.. ముకుందా...


శ్రీకృష్ణుడి విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న మహిళలు


అలంపూర్ చౌరస్తా విశ్వశాంతి పాఠశాలలో ఉట్టి వేడుకల్లో విద్యార్థులు

జిల్లాలో కనుల పండువగా కృష్ణాష్టమి వేడుకలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఉట్టికొట్టే వేడుకల్లో భక్తుల సందడి
- కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించిన చిన్నారులు

గద్వాలటౌన్: జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు 'ముకుందా.. ముకుందా.. హరేకృష్ణ' నామస్మరణతో జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లోని కృష్ణమందిరం, చెన్నకేశవ స్వామి ఆలయం, వేదనగర్‌లోని పాండురంగస్వామి ఆలయాలు మార్మోగాయి. రాధాకృష్ణుల ఆలయాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. చిన్నారులను చిన్ని కృష్ణుడు, గోపిక వేషధారణతో తీర్చి దిద్దారు. మందిరాల వద్ద కృష్ణుడి ప్రతిమలు ఏర్పాటు చేశారు. పలుచోట్ల ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో, సరస్వతీ శిశుమందిరంలో ఘనంగా నిర్వహించారు. ఇందూ జ్ఞాన వేదిక, ప్రబోధ సేవా సమితి సంయుక్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. విగ్రహ ఊరేగింపు వైభవంగా సాగింది. పాటలు, కోలాటంతో భక్తులు హోరెత్తించారు.



గద్వాల: గద్వాల పట్టణంలోని రాజవీధిలోని శ్రీకన్యాకపరమేశ్వర ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.

అలంపూర్: నియోజకవర్గంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ఉట్టి కొట్టారు. మాంటిస్సోరి పాఠశాలలోవేడుకలు నిర్వహించారు.

అలంపూర్ రూరల్: మండలంలోని గ్రామాల్లో ఘనంగా చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణతో అకట్టుకున్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. జూలెకల్ శివారులోని ఆర్డీఎస్ కెనాల్ సమీపంలో వెలసిన శ్రీకృష్ణుని ఆలయంలో దాతలు కర్నూలు జిల్లా కొత్తకోట సింగవరం రాఘవరెడ్డి దంపతులు, కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉండవెల్లి: మండల కేంద్రం, కంచుపాడు, తక్కశిల గ్రామంలోని యాదవుల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో కృష్ణుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తక్కశిలలో కృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కంచుపాడులో కృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో శ్రీకృష్ణుని చిత్రపటాన్ని పురవీధులలో కోలాటాలతో ఊరేగించారు. ఊరవాకిలిలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

అయిజ: మున్సిపాలిటీలో, గ్రామాల్లో శ్రీకృష్ణుడి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులు వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు.

ధరూరు: మండల కేంద్రం, ఆయా గ్రామాల్లో చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఆలయాల్లో పూజలు చేశారు.

మల్దకల్: మండలంలోని సద్దలోనిపల్లిలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాత్రి స్వామి వారి జననం, స్వామి వారి ఉత్సవమూర్తులతో పల్లకీసేవ నిర్వహించారు. వేడుకలకు హాజరైన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అలయ అర్చకులు కృష్ణయ్యచారి, పాండురంగాచారి, భక్తులు పాల్గొన్నారు.


రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు


ఎర్రవల్లిలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

ఎర్రవల్లి: ఉమ్మడి ఇటిక్యాల మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుటాన్‌దొడ్డి, ధర్మవరం, తదితర గ్రామాల్లో శ్రీకృష్ణ కల్యాణం వైభవంగా నిర్వహించారు.


చిన్ని కృష్ణుడి వేషధారణలో చిన్నారులు


ఉండవెల్లిలో విద్యార్థుల నృత్యం


జూలెకల్ శ్రీకృష్ణుడి ఆలయంలో భక్తుల పూజలు


సద్దలోనిపల్లి కృష్ణస్వామి ఆలయంలో పూజలు


ధర్మవరంలో కల్యాణం చేస్తున్న అర్చకులు

కడుపుకోత ఏ తల్లికీ రాకూడదు

- బాధిత కుటుంబానికి అండగా ఉంటాం : ఎమ్మెల్యే విజేయుడు
- రూ.5 లక్షలు పరిహారం అందిస్తాం : విద్యుత్ అధికారి


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజేయుడు, విద్యుత్ అధికారి

అలంపూర్ రూరల్: 'అధికారుల నిర్లక్ష్యం వల్ల నా కొడుకు చనిపోయి నాకు కడుపు కోత మిగిలింది. ఇలాంటి కడుపు కోత ఏ తల్లికీ రాకూడదు' అని విద్యుత్ స్తంభంపడి మృతి చెందిన మహేష్ తల్లి మానస ఆవేదన వ్యక్తం చేసింది. అలంపూర్ పట్టణంలోని 8వ వార్డు సంగమేశ్వర ఆలయ సమీపంలో ఆదివారం విద్యుత్ స్తంభం పడి బాలుడు మృతి చెందిన సంఘటన విధితమే. సోమవారం తెలంగాణ అతిథి గృహంలో ఎమ్మెల్యే విజేయుడు, బాధిత కుటుంబ సభ్యులు, విద్యుత్ అధికారులతో చర్చలు నిర్వహించారు. అంతకు ముందు టూరిజం దగ్గరికి బాలుడి కుటుంబ సభ్యులతో పాటు కాలనీ వాసులు పెద్దఎత్తున తరలివచ్చారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రమాదం సంభవించిందని ఆందోళన చేపట్టి ధర్నా చేయాలని నిర్ణయించారు. నాయకులు సర్ది చెప్పడంతో ధర్నా ప్రయత్నం విరమించారు. ఆస్పత్రి దగ్గర బాలుడి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే విజయుడు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు.

రూ.5లక్షలు పరిహారం అందిస్తాం

సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి రూ.5లక్షల పరిహారం అందిస్తామని విద్యుత్ అధికారి సుబ్బారాయుడు తెలిపారు.3నెలల లోపు బాధిత కుటుంబానికి పరిహారం అందేలా చూస్తామన్నారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు న్యాయవాది నారాయణ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

జీతాలు రావడం లేదని ఎమ్మెల్యేకు వినతి

అలంపూర్ రూరల్: అలంపూర్ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలు రావడం లేదని ఎమ్మెల్యే విజేయుడికి సోమవారం వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న 21 మంది సిబ్బందికి 2 నెలలుగా జీతాలు రావడం లేదని తెలిపారు. 22నెలల నుంచి కార్మికుల పిఎఫ్, ఈఎస్‌ఐ అకౌంట్‌లో జమ కాలేదని, త్వరితగతిన జీతాలు వచ్చేలా చేయాలని కోరారు. మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న 16 మంది సిబ్బందికి 8 నెలలుగా జీతాలు రావడంలేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే మున్సిపల్ కార్మికులకు హామీ ఇచ్చారు.

తాగి వాహనం నడిపితే జైలుకే..



రాజోళి: మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని ఎస్‌ఐ జగదీష్ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేశారు. తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించి కుటుంబాలలో తీరని శోకం మిగులుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

తల్లీ కుమారుడు అదృశ్యం


పావని, విశాల్(ఫైల్)

రాజోళి: రెండేళ్ల కొడుకుతో తల్లి అదృశ్యమైన సంఘటన మండలంలోని మాన్‌దొడ్డిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగదీష్ వివరాల ప్రకారం.. మాన్‌దొడ్డికి చెందిన కుమ్మరి నాగరాజుకు ఎనిమిదేళ్ల క్రితం పావనితో వివాహమైంది. ఏడాది క్రితం భార్యతో కలిసి జీవనోపాధి కోసం బెంగుళూరు వెళ్లి, కొద్ది రోజుల కిత్రం తిరిగొచ్చి గ్రామంలోనే ఉంటున్నారు. వారికి ఇద్దరు అమ్మాయిలు, కుమారుడు విశాల్ ఉన్నారు. ఈ నెల 23న రెండేళ్ల కుమారుడితో ఇంట్లో నుంచి పావని వెళ్లిపోయింది. ఇంతవరకు ఇంటికి తిరిగి రాలేదు. వారి బంధువులు, సన్నిహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె భర్త నాగరాజు సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విగ్రహ పునఃప్రతిష్ఠపై చర్చ



అయిజ: మున్సిపాలిటీలోని అంబేడ్కర్ చౌక్‌లో గతంలో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహం పునఃప్రతిష్ఠించేందుకు మున్సిపల్ చైర్మన్ చిన్నదేవన్న అఖిలపక్ష నాయకులతో మాట్లాడారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అఖిలపక్షం నాయకులను మున్సిపల్ చైర్మన్ కలిశారు. పాతబస్టాండ్–కొత్త బస్టాండ్‌ల మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి సందర్భంగా రోడ్డును వెడల్పు చేశారని, దాని వల్ల రోడ్డుపక్కన ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని రోడ్డు మధ్యలో పునఃప్రతిష్ఠించాలని, దానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని అఖిలపక్ష నాయకులు మున్సిపల్ చైర్మన్‌ను సూచించారు. నిబంధనల మేరకు విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించే విధంగా కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ అన్నారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు ఆంజనేయులు, వెంకట్రాములు, అంజి, మైనర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

గద్వాల ఇన్‌చార్జ్ సీఐగా నాగేశ్వర్‌రెడ్డి

గద్వాల క్రైం: గద్వాల ఇన్‌చార్జ్ సీఐగా సీసీఎస్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న నాగేశ్వర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐగా విధులు నిర్వహిస్తున్న భీంకుమార్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం విధితమే. వారి స్థానంలో ప్రస్తుతం ఇన్‌చార్జ్ సీఐని నియమిస్తూ ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అయిజ: మున్సిపాలిటీలోని కొత్తపేట కాలనీకి చెందిన చాకలి నరసింహులు కూతురు శ్రీకృతి ఇటీవల గుడిసె గోడ కూలి మృతిచెందడంతో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి పరామర్శించారు. సోమవారం పట్టణంలోని చాకలి నరసింహులు ఇంటికి తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి నాయకులు చేరుకొని ఆయన భార్య రేవతికి తగిలిన గాయాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రెవెన్యూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేవిధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి నాయకులు బండలయ్య, నరసింహులు, నాగేష్, తిమ్మప్ప, తిరుమలేష్, పరమేష్, శివన్న, శివ, తిరుమలేష్, బందన్న, శివకుమార్, రవికుమార్ వెంకటరాముడు, రామకృష్ణ పాల్గొన్నారు.

చిన్నోనిపల్లె కాల్వ పనుల పరిశీలన


చిన్నోనిపల్లె రిజర్వాయర్ దగ్గర కాల్వ తవ్వకం పనులను పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ, ఇంజనీరింగ్ అధికారులు

గట్టు: చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లో అదనపు నీటిని బయటకు పంపేందుకు ఏర్పాటు చేస్తున్న కాల్వ పనులను సోమవారం మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ పరిశీలించారు. రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరుగుతూ నివాస గృహాల వైపు వచ్చే అవకాశం ఉండడంతో నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో అధికారులు చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లో సమాంతర కాల్వను ఏర్పాటు చేసి అదనంగా వచ్చి చేరుతున్న నీటిని రిజర్వాయర్ బయటకు పంపే విధంగా కాల్వ తవ్వకం పనులు చేపట్టారు. కాల్వ తవ్వకంలో రిజర్వాయర్ కట్ట కింద ఉన్న లింగాపురం రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న తరుణంలో కాల్వ తవ్వకం ఆలస్యమవుతూ వచ్చింది. కాల్వ తవ్వకం పనులను సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు మాజీ ఎంపీపీ విజ్ఞప్తి చేశారు. రైతులతో మాట్లాడి కాల్వ పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మల్దకల్ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ గంగాధర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల విశిష్టతను వారికి తెలిపారు. అనంతరం ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు గంగాధర్ దంపతులను సత్కరించి మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో యూబీఐ ఫీల్డ్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరణే పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

అలంపూర్ రూరల్: సీపీఎస్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ విధానం అంగీకరించే ప్రసక్తే లేదని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించడమే ఏకైక పరిష్కార మార్గమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దేవరపోగు రమేష్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు శుభవార్త పేరుతో ఇచ్చిన ప్రకటనకు స్పందిస్తూ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 25 ఏళ్ల పూర్తి చేసుకున్న ఉద్యోగులకు 50 % పెన్షన్ గ్యారంటీ చేస్తున్నట్లు, సర్వీస్‌లో మరణించిన ఉద్యోగ కుటుంబ సభ్యులకు 60% ఫ్యామిలీ పెన్షన్ ప్రకటించినప్పటికీ, చందాతో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు విషయాన్ని ప్రస్తావించలేదన్నారు. పాత పెన్షన్ పునరుద్ధరించే వరకు టీఎస్‌యూటీఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రాముడు, రాజకుమార్, ఏ.వెంకటేశ్వర్లు, మద్దిలేటిస్వామి, వెంకటేశ్వర్లు, సుందర్‌రాజు, ముస్తాక్, వెంకట్రాముడు, బీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి


ధర్మవరంలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న పీడీఎస్‌యూ నాయకులు

ఎర్రవల్లి: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ వసతి గృహంతో పాటు ధర్మవరంలోని బీసీ వసతి గృహాన్ని ఆయన సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. వసతి గృహాల్లో నూతన వంట గదుల ఏర్పాటు, డార్మేటరీలో కిటికీలు, తలుపులు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆయన కోరారు. ఆయన వెంట వెంకటేష్, నవీన్, మురళి, మనోజ్, దినేష్ ఉన్నారు.